

# స్వర్గారోహణ పర్వము

అందరూ లోపలకూర్చున్నాక సుబ్బన్నగారు క్షమాపణ చెప్పుకున్నారు. "వెంఠనే పిచ్చరు తీద్దాం. అల్లుడా నువ్వేంచేస్తావు చెప్పు. హీరో వేస్తావా? నాగేశ్వర్రావుకి ఛాన్సు ఇస్తావా. పోనీ రాస్తావా? నచ్చకపోతే సముద్రాల సీనియర్‌ని ఎంకరేజ్ చేదాం. డైరెక్షను చేస్తావా? వద్దంటే కె. వి. ని పైకి తెద్దాం. కమాన్ చెప్పు." అన్నాడు ఉత్సాహంగా.

"నేను పిచ్చరు తియ్యనండి. మావూరు పోతా" అన్నాడు రాజు వాళ్ళబామ్మని తలచుకొని.

సుబ్బన్నగారు కొయ్యబారి తేరుకుని "ఛంపేవు అల్లుడా! పిచ్చరు తీసి తీరాలి. నీలాంటి యువరక్తం కావాలి ఫీల్డుకి. నేనప్పుడే నీ ఆసరా

చూసుకుని మన .కంపెనీకి డిస్ట్రిబ్యూషన్ మాట్లాడేశా. అపుడే ఫస్టు ఇన్‌స్టాలుమెంటు డబ్బు తీసుకుని కొత్తకారుకి ఎడ్వాన్సు కట్టాను. ఇపుడు నువ్వు మతాబా కాల్చేస్తే చచ్చేనే ఆ డబ్బంతా మళ్ళీ ఎక్కడ తేను—" అన్నాడు.

రాజు ఆలోచించి, చివరికి సరే అన్నాడు. కాని స్టోరీ మాముత్తెం చేత రాయించాలి అన్నాడు.

"సారీ గురో నాకు టైములేదు. నేను థర్టీన్ ఫిలింస్‌కి రాస్తున్నాను. జూన్ 1978 దాకా ఆగితే నీకు రాస్తాను" అన్నాడు ముత్తెం.

"రేటు అయిదూ ప్లస్ పదహైదు. రెండో అంకె బ్లాకు" అన్నాడు అతని తాలూకు వంది మాగధరావు.

"ఓరి బాబోయ్: చూస్తూ ఉండగా ఎంత వాడివయ్యావు."

"నువు చూళ్లేదుగా" అన్నాడు ముత్యం బ్రిలియంట్‌గా.

"నాకన్న వెనక—"

"—వచ్చిన కొమ్ములు వాడి" అన్నాడు ముత్తెం మరీ బ్రిలియంట్‌గా.

"సెబ్బాష్" అన్నాడు వంధిమాగధులు ఆనందం పట్టలేక.

* * * *

ప్రదర్శనం ఆరంభమైంది. సుబ్బన్న, రాజు చెవిలో ప్రొడక్షన్ ప్రోగ్రాం అంతా ఏకరువు పెడుతున్నాడు.

రెండో రీలులోనే హీరో వచ్చాడు. ''నా హృదయాన్ని నీకు—" అన్నాడు క్లోజప్‌లో.

''అర్పిస్తున్నాను'' అన్నాడు మిడ్ షాట్‌లో. ఎటొచ్చీ ఈ రెండో షాట్ ఉన్న ఫ్రేములో అతని బొమ్మ కనిపించనేలేదు. అతను ఉండ వలసినంత మేరా నల్లగా కాళీగావుంది. మిగతా భాగంనిండా హీరోయిను వుంది. ఆ తరవాత కూడా హీరోబొమ్మ కనిపించటం లేదు. అతను వుండే మేర కాళీగానే వుంటోంది.

అదేమిటి అన్నాడు రాజు.

''హీరో, వరసగా ఇరవై కాల్‌షీట్లకు గైరుహాజరై పోయాడు. మిగతావాళ్లు వచ్చినందువల్ల హీరో చోటుని మాస్క్ చేసి ఫిలిం చేసేశారు'' ప్రొడ్యూసరు.

'ఇలా ఎన్ని రీళ్లుంది' అన్నాడు రాజు.

''పన్నెండూ, అయితేనేం. డబుల్ కాల్‌షీట్లు పెట్టి రెండురోజుల్లో తీసి కలిపేస్తాంలెండి. రిలీజు అవతలెల్లుండిగా. ఆర్టిస్టు పెద్దవాడు. ఇట్టే నటించేస్తాడు'' అన్నాడు ప్రొడ్యూసరు.

"అయిడియ" అన్నాడు ముత్యం హఠాత్తుగా.

"రాజూ! మన వూళ్ళో ఓసారి ఇలాగే ఫిలింవేస్తూ ఉంటే ఒక యాక్టరు ఊడిపోయాడు. గుర్తులే? వాణ్ణి మనం మళ్ళీ ఆ కాళీలోకి ఎక్కించేశాం....నువ్వు ఈ పిక్చర్లో కాళీ ఎంతుందో అంతే ఉన్నావు గదా?"

'సెబాష్' అన్నారు వందిమాగధులు.

"ఔనౌను అల్లుడా ప్రొడ్యూసరుగారికి అభ్యంతరం లేకపోతే ఈ కాళీలోకి నువ్వెక్కిపో. నేనూ మన డిస్ట్రిబ్యూటరూ, నీ బలగంఅంతా కలిసి నిన్నుపైకి తోసేస్తాం. అందులో ఎక్కిపో" అన్నాడు.

ప్రొడ్యూసరుగారు రెడీయే అన్నారు.

"మరి పదమూడో రీలులోంచి పాతహీరో వస్తాడే. ఎలా కలుస్తుంది" అన్నాడు రాజు.

"దానికేం ఫరవాలేదు. నీకు ఎవడో ఋషి శాపంయిచ్చి నువ్వింక నుంచి ఫలానా హీరోలాగా కనిపించుగాక అని శాపం ఇస్తున్నట్టుగా ఓ రెండొందల అడుగుల ఫిలింతీసి పన్నెండో రీలు చివర అతికిస్తే సరి!" అన్నాడు ముత్యం.

"బెస్టు. మామూలుగా హీరోలు రెండేసి రోల్సు వేస్తే, మనదాంటో ఇద్దరు హీరోలు ఒకరోలే వేశారని పబ్లిసిటీ చెయ్యొచ్చు" అన్నాడు ప్రొడ్యూసరు.

ఇకనేం పదండంటే పదండన్నారు. అంతా కలిసి తెరదగ్గరకెళ్ళారు.

ప్రేమ ఘట్టం జరుగుతోంది. "కొంచెం ఆగండి. నాకు సిగ్గేస్తూంది. హీరోయిను గబుక్కున నువ్వెవరనొచ్చు" అన్నాడు రాజు.

తరవాత సీనులో తుపాను. హీరో ఉండాల్సిన చోటు బండకి అంటిపెట్టుకుని వణుకుతోంది. తెర ఉరిమింది. పిడుగు పడింది. భోరున వాన. హోరునగాలి.

"స్థిమితంగా ఉంది. ఎక్కెపో. గుడ్‌లక్" అన్నాడు ముత్యం.

రాజు బలగం అతన్ని పైకెత్తి హీరో కాళీలోకి తోసేసింది.

చేతులు దులుపుకుని అంతా మళ్ళీ వచ్చి బాల్కనీలో తృప్తిగా కూర్చున్నారు.

తెరమీద హీరో కాళీలో రాజు సద్దుకుని ఝూంమని నటించేస్తున్నాడు.

"మనవాడు గట్టివాడే" అన్నాడు ముత్యం, అన్నాడు సుబ్బన్న, అన్నారు వాళ్ళిద్దరి వంధిమాగధులిద్దరూ.

ప్రొడ్యూసరు, అవతలికి వెళ్ళి తన కంపెనీకి టెలిఫోను చేసి వచ్చాడు.

*   *   *   *

దూరంగా సినిమాపేటలోని ప్రొడక్షన్ ఆఫీసులో కునికిపాట్లు పడుతూ కూర్చున్న పబ్లిసిటీ అసిస్టెంటు, లేచి ఆవలించి సిగరెట్టు ముట్టించి ఫోనులో ప్రొడ్యూసరు ఇచ్చిన ఆజ్ఞప్రకారం, పత్రికకు పంపడానికని కొత్త హీరో వరహాలరాజు గురించి పాంఫ్లెట్ తయారు చేయడం మొదలెట్టాడు.

"వెండితెరకు ఎక్స్‌ఫిలింస్ వారు సమర్పించు కొత్త హీరో .... గారు (ఊరు....) చలన చిత్రజగతి ప్రగతికే హీరో కాగలవాడు. ఈయన కవి, రచయిత, గాయకుడు. సంగీత దర్శకుడు మొ॥ బహుశా హీరో పనేకాక, తీరిక వేళలో మిగతా కవి, గాయకుడు, డైరెక్టరుల పాత్రలూ నిర్వహించవచ్చు. అసలు బాల్యమునుండీ ఈ నవయువ . . . కి . . ?. ఉగ్గుపాలతో పెట్టిన విద్య.

ఎక్స్ ఫిలింస్ వారి బ్రహ్మాండమైన తాజా పౌరాంఘిక జానపద చిత్రంలో....గారు సాంఘిక హీరోగా అత్యద్భుతమైన నటన ప్రదర్శిస్తున్నారు. చిత్రం విడుదల అయి కొన్ని సన్మానాలు కాగానే వీరి నటన మహోత్తమంగా ఉన్నదని పలువురు ప్రశంసించ సంసిద్ధంగా ఉన్నారు.

....గారు యావద్భారత. ?. కాగలరనడానికి ఎంథో సందేహము లేదు .... .... అని శ్రీయుత....గారు అన్నారు. శ్రీయుత....గారు చాలా గొప్పవారని డా॥ .... .... గారూ, కొందరు దొరలూ లోగడ చెప్పడం లోకవిదితమే.

డా॥ .... గారూ కొందరు దొరలూ కూడా ఎంతో చాలా గొప్పవారని ఎక్స్ ఫిలింస్ వారి కొత్త........శ్రీ....గారు చాలాసార్లు అన్నారు!

శ్రీ.... గారు నవయువకులు. వీరు బాల్యమునుండే .... .... ....